సాక్షి
వరంగల్
మంగళవారం । 26 । నవంబర్ । 2024



వాహనానికి బీమా తప్పనిసరి
కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతీ వాహనానికి బీమా తప్పనిసరి. వాహన బీమా ఉపయోగాలు, రకాలు, బీమా చేయించే విధానంపై ప్రత్యేక కథనం. - 8లో



పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం
జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల సమీపంలోని ఓ పత్తి మిల్లులో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. - 8లో

గరిష్టం/కనిష్టం
$28^0/16^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే మాధవరెడ్డి



నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు.

వివేకానందుడి మార్గం అనుసరణీయం



చెన్నారావుపేట: స్వామి వివేకనందుడి మార్గం అనుసరణీయమని, యువత ఆయన చూపిన మార్గంలో ముందుకెళ్లాలని భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వివేకానందుడి విగ్రహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెన్నారావుపేట బస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ఆదిత్య సాయి,జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల రవి,చొల్లేటి జగదీశ్వర్, సుర్క్ష, ప్రముఖ్ చరణ్, అల్లాడి భాస్కర్‌లు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



చెన్నారావుపేట: మండలంలోని ప్రభుత్వ గ్రామ, మండల కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం-2005 బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు రక్షణ చట్టం 2005 జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్లైపు ప్రణీత్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 26 ప్రకారం గ్రామస్థాయి వరకు సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

29న పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్

నర్సంపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం వివిధ పారా మెడికల్ కోర్సులకు ఈ నెల 29న అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 29న ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తులు తీసుకుని నర్సంపేట మెడికల్ కళాశాలకు రావాలని సూచించారు. డీఈసీజీలో 27, డయాలసీస్‌లో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తు ఫారం, పూర్తి వివరాల కోసం tgpmb.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

తుమ్మలమయం

ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపులా పెరిగిన చెట్లు

- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు

దుగ్గొండి: తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ.. ప్రతిఏటా అన్నదాతల పంటలకు సాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు. అయితే ప్రాజెక్టు పరిధిలోని కాలువలకు ఇరువైపులా ఉన్న రహదారులు సర్కారు(పట్నం) తుమ్మలతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ ద్వారా పంటలకు నీరు అందుతోంది. డీబీఎం-38, 42, 48, 30, 31, 23, 24, 25, 27 ప్రధాన కాల్వల ద్వారా 2,93,367 ఎకరాలకు సాగునీరు అందుతోంది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో శ్రీరాంసాగర్,మిడ్‌మానేర్, లోయర్ మానేర్‌లలో నీరు పుష్కలంగా నిల్వ ఉంది. దీంతో కాల్వల ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండటంతో రైతులు రబీ పంటలు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారు. పత్తి పంటలు తీసి ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో వరి పంట వేయడానికి నార్లు పోస్తున్నారు.

81.6 కిలోమీటర్ల పొడవునా తుమ్మలు

ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాల రైతులకు సాగునీరు అందించే 81.6 కిలోమీటర్ల పొడవు గల ప్రధాన కాల్వకు ఇరువైపులా రహదారులు పట్నం తుమ్మలతో నిండిపోయాయి. దీంతో రైతులు కాల్వల వెంట నడవలేని పరిస్థితి నెలకొంది. డీబీఎం 38 కాల్వ పరిధిలో 78,614 ఎకరాల్లో రబీ పంటలు సాగు కానున్నాయి. కాల్వకు ఇరువైపులా పెరిగిన తుమ్మలను తొలగించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సర్కారు తుమ్మలు(పట్నం తుమ్మలు) తొలగించాలని రైతులు కోరుతున్నారు.



డీబీఎం 38 ప్రధాన కెనాల్



శివాజీనగర్ నుంచి నల్లబెల్లి వరకు డీబీఎం -38 కాల్వ రహదారిని కమ్మేసిన తుమ్మ చెట్లు

ఎస్సారెస్పీ కాల్వలు.. ఆయకట్టు వివరాలు..

కాల్వలు	ఆయకట్టు (ఎకరాల్లో)
డీబీఎం-38	78,614
డీబీఎం-42,48	1,43,000
డీబీఎం-30,31	51,118
డీబీఎం-23,27	20,635

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం..

డీబీఎం -38 కాల్వ 81.6 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. దాని పొడవునా రహదారి ఉంది. రహదారికి ఇరువైపులా పట్నం తుమ్మలు ఉన్నాయి. వాహనాలు, ఎడ్లబండ్లు వెళ్లడం కష్టంగా మారింది. మరో నెల రోజుల్లో సాగునీరు విడుదల చేసే సమయం వచ్చింది. కాల్వకు ఇరువైపులా ఉన్న పట్నం తుమ్మలను తొలగించడానికి ఎస్టీమేట్‌లు చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం..

- రామకృష్ణ, ఎస్సారెస్పీ డీబీఎం-38 డీఈ

అరక కట్టుకుని వెళ్లాలంటే కష్టంగా ఉంది..



మల్లిపల్లి గ్రామం ఎస్సారెస్పీ కెనాల్ డీబీఎం 38 కాల్వ కింద 6ఎకరాల భూమి ఉంది. ప్రతిరోజూ బావి వద్దకు వెళ్తుంటాం. కాల్వకు రెండు వైపులా ఉన్న రహదారులు పట్నం తుమ్మలతో మూసుకుపోయాయి. తుమ్మల మధ్య నుంచి ఎద్దులను అరకకట్టుకుని వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి తుమ్మలు తొలగించి రహదారి మరమ్మతు చేయాలి.

- దానం వీరేందర్, రైతు, మల్లిపల్లి

ఎస్సారెస్పీ రోడ్లను బాగుచేయాలి..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సుమారుగా 3లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. ఈ సారి సరిపడా వర్షాలు కురవడం, ప్రాజెక్టుల నిండా నీరు ఉండటంతో రబీ పంటకు నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వను పట్టించుకోకపోవడంతో తుమ్మలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది కాకుండా కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాల్వకు ఇరువైపులా ఉన్న రహదారులు అనేక గ్రామాలను కలుపుతున్నాయి. దీంతో రవాణా దూరం తగ్గి ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తక్షణం రహదారులను మరమ్మతులు చేయించి భవిష్యత్‌లో తారు రోడ్లుగా మార్చాలి.

- సోమిడి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్

సైన్స్ ఫెయిర్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి 28వరకు శివాని పబ్లిక్ స్కూల్‌లో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- 13 మండలాల నుంచి 500 ఎగ్జిబిట్ల ప్రదర్శన



జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

నర్సంపేట రూరల్: వరంగల్ జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ఉదయం 10గంటలకు ప్రారంభవుతుందని వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం సైన్స్ ఫెయిర్ వివరాలను వెల్లడించారు. సైన్స్ ఫెయిర్ కోసం సర్వం సిద్ధం చేశామని, పర్యవేక్షణకు 17రకాల కమిటీలను నియమించామని తెలిపారు.

13మండలాల నుంచి ఎగ్జిబిట్లు

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13మండలాల నుంచి విద్యార్థులు 500రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, సీనియర్ విభాగంలో 9నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తారని వివరించారు. వీటితో పాటుగా జిల్లాలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో బీఈడీ, డీఈడీ విద్యార్థులకు టీచర్స్ ట్రెనింగ్ కేటగిరిలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు టీచర్స్ కేటగిరిలో వినూత్నమైన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చని తెలిపారు. సైన్స్ ఫెయిర్‌లో ఆవిష్కరణలు, ఎగ్జిబిట్లను ప్రదర్శించే విద్యార్థులు మంగళవారం ఉదయం ఎగ్జిబిట్లతో నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారు శివాని పబ్లిక్ స్కూల్‌కు చేరుకుని తమ ఎగ్జిబిట్లను ప్రదర్శనకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నేటి మధ్యాహ్నం నుంచి 28వ తేదీ మధ్యాహ్నం వరకు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ వీక్షకులకు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి వీక్షించడానికి వచ్చే పాఠశాలల విద్యార్థులు శాస్త్ర అభిమానులకు సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను బాల శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో కొల్లూరి ఫ్లోరెన్స్, నిర్వహణ కమిటీ సభ్యులు పట్టాభి, ఎంఈఓ కొర్ర సారయ్య, శివాని పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో భక్తుల సందడి

- 8లో



బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్



మానుకోట మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్

- మానుకోట మహాధర్నాకు తరలివచ్చిన గిరిజనులు
- ఉత్సాహం నింపిన కేటీఆర్ ప్రసంగం



మానుకోట పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ మహాధర్నాకు హాజరైన కార్యకర్తలు, జనం

మహబూబాబాద్: లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన మహాధర్నా విజయవంతమైంది. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మరో ఉద్యమానికి మానుకోట నాంది అవుతుందని చెప్పి కార్యకర్తల్లో జోష్ నింపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎస్టీ రిజర్వేషన్‌ను 6 నుంచి 10శాతానికి పెంచామని, తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు చెప్పారు. రైతు బంధు, రైతు బీమా, 24గంటల ఉచిత విద్యుత్ ఇచ్చింది కేసీఆర్ అని చెబుతూ కార్యకర్తల నుంచి అవును అనే సమాధానం రాబడుతూ.. ఉత్సాహం నింపారు. గిరిజనులు ఏకం కావాలని, ఎక్కడ అన్యాయం జరిగినా బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేతలు ఏం మాట్లాడారంటే..



- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గిరిజనుల భూములు లాక్కుంటే సీఎంను ఉరికించి కొడతారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతోనైనా ముఖ్యమంత్రికి కనువిప్పు కలగాలని హితవు పలికారు.



- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ గిరిజనులు, దళితులకు రక్షణ కవచంగా ఉంటే.. రేవంత్ రెడ్డి వారి భూములను లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతపాలన చేస్తున్నదని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతోనే కాంగ్రెస్ ఖేల్ ఖతమైందన్నారు.
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. సీఎం గిరిజనుల భూములు లాక్కొని అల్లుడికి ధారాదత్తం చేస్తామంటే ఎవరూ ఊరుకోరని, రాష్ట్ర వ్యాప్తంగా అందరిని ఏకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు.
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గిరిజనులు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, లగచర్ల రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు జగదీశ్వర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాతా మధు, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ హరిప్రియ, గండ్ర వెంకటరమణారెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఎస్.నరేందర్ పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



ప్రజావాణిలో ఫిర్యాదురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: ప్రజావాణి వినతులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్‌డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డిలతో కలిసి కలెక్టర్ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను అధికారులు పెండింగ్ ఉంచొద్దని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 107 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫారస్ చేశారు. ఈ దరఖాస్తుల్లో రెవెన్యూ భూ సంబంధిత సమస్యలపై 43, డీఆర్‌డీఓ 12, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సెక్షన్ 9, డీఎంహెచ్ఓ 6, జిల్లా విద్యాశాఖ 3, జిల్లా సంక్షేమ శాఖ 1, ఇరిగేషన్ శాఖ 5, జిల్లా వ్యవసాయశాఖ 4, జెడ్పీ సీఈఓ 2, జీడబ్ల్యూఎంసీ 6, రీజినల్ కోఆర్డినేటర్ ఆఫీస్ 2, ఉపాధి కల్పన శాఖ 3, సివిల్ సప్లయీస్ 2, లీడ్ బ్యాంకు మేనేజర్ 1, జిల్లా పంచాయతీ శాఖ 3, ఎస్సీ కార్పొరేషన్ 4, ఎండోమెంట్ శాఖకు ఒక దరఖాస్తు వచ్చిందని వెల్లడించారు. అధికారులు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

5వ తరగతి సీటు ఇప్పించాలి..



నా కుమార్తె సట్ల పూజితను టీజీ సెట్-2024 పరీక్ష రాయించాను. ఎక్కడా సీటు రాలేదు. జిల్లాలోని ఏదేని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్(బాలికలు) పాఠశాలలో 5వ తరగతిలో సీటు ఇప్పించాలి.

- సట్ల రాజు, షాపూర్, సంగెం మండలం

పంట రుణ మాఫీ చేయాలి..



హనుమకొండ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నాను. మిత్తితో కలిసి రూ.1,19,025లు బాకీ ఉంది. ఇప్పటి వరకు ఈ అప్పు మాఫీ కాలేదు. వెంటనే మాఫీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మీనారాయణ, ఆశాలపల్లి, సంగెం

డబ్బాను తొలగించారు..



నాకు ఒక కాలు లేదు. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో 40ఏళ్లుగా డబ్బా పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. రేణికుంట్ల శివ, నాగరాజు తన డబ్బాను తొలగించి వేరే అతని డబ్బాను పెట్టించారు. ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. డబ్బా లేకపోవడంతో తిండికి కష్టంగా ఉంది. న్యాయం చేయాలి.

-సింగిరెడ్డి సుదర్శన్, శివనగర్, వరంగల్

ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలి



కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్)విషయంలో జిల్లా రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో 2024-25 ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు కస్టం మిల్లింగ్ రైస్ కేటాయింపు, అదనపు మిల్లింగ్ చార్జీలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించుటకు మిలర్లకు పలు సలహాలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించిన తర్వాత కోత విధించకుండా దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాకు కేంద్ర బృందం రాక

కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌కు చెందిన 8మంది డి కేటగిరి స్థాయి అధికారుల బృందం జిల్లాలో ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయన నిమిత్తం సోమవారం జిల్లాకు వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో వారు ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళ శిశు సంక్షేమం, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు బృందం సభ్యులకు వివరించారు. ఈ బృందం సభ్యులు డిసెంబర్ 3వ తేదీ వరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో పర్యటించనున్నారు. నర్సంపేట, వర్ధన్నపేట మండలాల్లోని లక్నేపల్లి, మాగ్దూంపూర్ గ్రామాలతో పాటు మున్సిపాలిటీల్లో పర్యటించి ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక అంశాలపై అధ్యయనం చేస్తారు. అధ్యయనం కోసం ఆయా గ్రామాల్లోనే బస చేయనున్నారు. ఈ బృందానికి నోడల్ అధికారిగా డీఆర్డీఓ కౌసల్యాదేవి వ్యవహరిస్తారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా శిక్షణ కేంద్రం ప్రాంతీయ మేనేజర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తేనే బోనస్

నల్లబెల్లి: రైతులు పండించిన సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకే రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మేడపల్లి, రాంపూర్, గోవిందాపూర్, కన్నారావుపేట, అర్శనపల్లి, రంగాపురం, ముచ్చింపుల, నాగరాజుపల్లి, గుండ్లపహాడ్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, జిల్లా నాయకులు ఎర్రబెల్లి రఘుపతి, తేజావత్ సమ్మయ్య నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏడాకుల సంపత్ రెడ్డి, మదర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్లె నుంచి పరిశోధనల వరకు.. - వివరాలు 8లో

క్లుప్తంగా

ఇంటర్‌వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీకి కేయూ జట్టు



మహిళా జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్ : కర్ణాటక బెల్గావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీలో నేటి నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న బ్యాడ్మింటన్ టోర్నీకి కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య సోమవారం తెలిపారు. ఎం.పూజితా రాగ ప్రియ (కేయూసీఈటీ వరంగల్)ఎస్.శ్రీనిత, పి.లక్ష్మి (వరంగల్ కిట్స్), కె.దీక్షిత (ఎస్‌డబ్ల్యూడీసీ, కొత్తగూడెం),ఎన్.అశ్విత (ఎంఐఎంఎస్ మంచిర్యాల) ఉన్నారు.

నాగసాధువు అఘోరీపై కేసు

మామునూరు : శ్మశాన వాటికలో పూజలు చేసి తల్వార్‌తో కోడి తలను నరికి హింసకు పాల్పడిన నాగసాధువు అఘోరీ మాతపై మామునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపురం క్రాస్‌రోడ్డులోని హిందూ శ్మశానవాటికలో నాగసాధువు, అఘోరీమాత ఇటీవల పూజలు చేస్తు విచక్షణ రహితంగా కోడిని బలి ఇవ్వడంపై నేరంగా పరిగణించాలని కోరుతూ జంతుపరిరక్షణ సమితి ప్రతినిధి కరీంనగర్ జిల్లా మానుకొండురు మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కాసురెడ్డి రోహన్‌రెడ్డి సోమవారం మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అఘోరీ మాతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల ఆందోళన

- కళాశాల యాజమాన్య వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు అధిక మొత్తంలో జరిమానా విధించడమే కాకుండా సెమిస్టర్ ఫీజులకు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష ఫీజులు కూడా పెంచారని వాపోయారు. ఈక్రమంలో తమకు న్యాయం చేయాలని నినాదించారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేపట్టగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విద్యార్థులను క్యాంపస్‌లోకి పంపించి ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాలను దిగ్బంధించారు.

వాహనానికి బీమా తప్పనిసరి

- ప్రమాదం జరిగితే యజమానితో పాటు ఇతరులకు పరిహారం
- లేకుంటే జరిమానా తప్పదు

మనం ఉపయోగించే వాహనాలకి తప్పనిసరిగా బీమా చేయించాలి.. కానీ ఈ విషయాన్ని అనేకులు వివిధ కారణాలతో విస్మరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 40 లక్షలకు పైగా వాహనాలుంటే వీటిలో సగం వాహనాలకు ఇన్సూరెన్స్ లేదని అధికారులు చెబుతున్నారు. వాహన బీమా ఉపయోగాలు, రకాలు, బీమా చేయించే విధానంపై అందరికీ పూర్తి స్థాయి అవగాహనపై ప్రత్యేక కథనం మీ కోసం..



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు(ఫైల్)

కాజీపేట: కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి. అనుకోకుండా ప్రమాదంలో వాహనానికి నష్టం వాటిల్లితే కాంప్రహెన్సివ్ బీమాతో తగిన పరిహారం పొందే వీలుంది. థర్డ్ పార్టీ బీమాతో ప్రమాదం జరిగినట్లయితే డ్రైవర్‌కు లేదా ప్రయాణికులకు, ప్రమాదానికి గురైన వ్యక్తులకు నష్టపరిహారం వర్తిస్తుంది. వాహనాన్ని బట్టి ప్రతి ఏడాది బీమా చెల్లించాలి. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోయినా, రవాణా వాహనాలకు బ్యాడ్జి నంబర్ లేకపోయినా, వాహన పత్రాల కాల పరిమితి ముగిసిన తర్వాత ప్రమాదం జరిగినా బీమా కంపెనీలు నష్ట పరిహారం చెల్లించదు. దీనికి వాహన యజమానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. తనిఖీల సమయంలో బీమా లేని వాహనానికి అధికారులు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

బీమాను ఎలా నిర్ణయిస్తారు..

వాహనాలకు బీమా ఎంత లభిస్తుంది అనే దానిని ఇన్సూరెన్స్ డిక్లేర్డ్ వాల్యూ (ఐడీవీ) అంటారు. వాహనం పోయినా, ప్రమాదంలో పూర్తిగా పనికి రాకుండా పోయినా ఐడీవీని పాలసీదారుడికి చెల్లిస్తారు. వాహన వయస్సు ఆధారంగా ఈ ఐడీవీని చెల్లించాల్సి ఉంటుంది. వాహనం కొనుగోలు చేసిన నెలలోపు అయితే 5 శాతం, ఏడాదిలోపు 15 శాతం, ఏడాది తర్వాత 20, రెండేళ్లు దాటితే 30, మూడేళ్లు దాటితే 40, నాలుగేండ్లకు పైబడితే 50 శాతం తరుగుదల తీసేస్తారు.

థర్డ్‌పార్టీ క్లెయిమ్..

ప్రమాదానికి కారణమైన పాలసీదారుడు లేదా బాధితులు లేదా వారి తరపున మరొకరు ప్రమాద సమాచారాన్ని వెంటనే బీమా కంపెనీకి, పోలీసులకు తెలియజేయాల్సి ఉంటుంది. థర్డ్‌పార్టీ కింద నష్టపరిహారం పొందేందుకు బాధితులు మోటారు వాహనాలకు సంబంధించిన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి ఉంటుంది. సొంత వాహనానికి ఏమైనా ప్రమాదం కారణంగా నష్టం జరిగితే వెంటనే బీమా కంపెనీకి సమాచారం ఇవ్వాలి. బీమా కంపెనీ ప్రతినిధులు వచ్చే వరకు వాహనాన్ని ప్రమాద స్థలంలో ఉంచాల్సి వస్తుంది. వాహనానికి సహజంగా జరిగే నష్టానికి బీమా కంపెనీలు నష్ట పరిహారం చెల్లించవు.

బీమా లేని పక్షంలో...

వాహనాలకు బీమా లేని సందర్భంలో రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధితులకు ఎటువంటి పరిహారం అందదు.పోలీసులు కేసు నమోదు చేసినప్పుడు ఇన్సూరెన్స్ పేపర్లు పోలీసులకు సమర్పించని పక్షంలో వాహనదారుడు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఆ తర్వాత విచారణలో జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

బీమా రకాలు ఇలా..

బీమా కంపెనీలు వివిధ రకాల పాలసీలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఇంజన్ ప్రొటెక్షన్, ఆయిల్ లీకేజీ, వేరే కారణాల వల్ల ఇంజన్‌కు నష్టం జరిగితే ఇంజన్ రీప్లేస్ చేసే విధంగా బీమా చేసుకునే వీలుంది. వాహనం దొంగతనానికి గురైనా లేక ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కొత్త వాహనాన్ని పొందే విధంగా పాలసీలు ఉన్నాయి. వాహన ప్రమాదంలో యజమాని లేదా ప్రయాణికులు, ఇతరులు మృతి చెందినా, అంగవైకల్యం పొందినా నష్టపరిహారం పొందేందుకు అనేక రకాల పాలసీలు అందుబాటులోకి వచ్చాయి.

ఏడాదికోసారి బీమా చెల్లించాలి

ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి తమ వాహనానికి సంబంధించి బీమా తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. బీమా చేయించలేని వాహనాలను రవాణా శాఖ అధికారులు ఎన్నిసార్లు పట్టుకుంటే అన్నిసార్లు జరిమానా చెల్లించాల్సిందే. మూడేళ్లకో సారి బీమా చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఇందుకు 20 నుంచి 30 శాతం వరకు ప్రీమియంలో మినహాయింపు ఇస్తున్నాయి.

పల్లెనుంచి పరిశోధనల వరకు..

- రూర్కెలా ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న కార్తీక్‌రెడ్డి
- సింగపూర్ సదస్సులో సోలార్ విద్యుత్ నాణ్యతపై పరిశోధన పత్రం ప్రదర్శన



మర్కాల కార్తీక్‌రెడ్డి

నర్సంపేట : పల్లెటూరులో మొదలైన తన ప్రస్థానం విదేశాలకు పాకింది. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినప్పటికీ మేనమామ, అమ్మమ్మ సహకారంతో చదువును కొనసాగించాడు. ఉన్నత చదువులు చదివి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చాడు. రాష్ట్ర సరిహద్దులు దాటి ఒడిశాలోని ప్రతిష్టాత్మక రూర్కెలా ఎన్ఐటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన మర్కాల కార్తీక్‌రెడ్డి గౌరవ డాక్టరేట్ పొందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు అభినందనలు తెలిపారు.

విద్యాభ్యాసం...

నర్సంపేటకు చెందిన కార్తీక్‌రెడ్డి మేనమామ, అమ్మమ్మల సహకారంతో చదువును కొనసాగించాడు. కొమ్మాల ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి, నర్సంపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేశాడు. అనంతరం ఉన్నత విద్య పూర్తి చేసి రూర్కెలా ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ పొందాడు.

పరిశోధన ఇలా...

కార్తీక్‌రెడ్డి ఎన్ఐటీ రూర్కెలా ఈఈఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వెంకటరమణ నాయక్, ప్రొఫెసర్ అనూప్‌కుమార్‌పాండా పర్యవేక్షణలో సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కి అనుసంధానం చేస్తూ విద్యుత్ నాణ్యతను పెంచే విధంగా మల్టీఫంక్షనల్ సిస్టంను అభివృద్ధి చేశాడు. దీనికి గాను పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఆయన చేసిన పరిశోధనా ఫలితాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో, సదస్సులలో ప్రచురించబడ్డాయి.



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కార్తీక్‌రెడ్డి

సింగపూర్‌లో ప్రదర్శనలు..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐఈఈఈ సంస్థ గతేడాది సింగపూర్‌లో నిర్వహించిన ఐఈకాన్ అంతర్జాతీయ సదస్సులో కార్తీక్‌రెడ్డి తన పరిశోధన ఫలితాన్ని ప్రదర్శించడం జరిగింది. వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొని ఈ సదస్సులో మల్టీ ఫంక్షనల్ సోలార్ సిస్టం అడాప్టివ్ ఫిల్టరింగ్ కంట్రోల్ స్కీమ్స్ ద్వారా నియంత్రించబడుతూ చాలా సులువుగా సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కి అనుసంధానం చేస్తూ విద్యుత్ నాణ్యతలో ఎదురయ్యే వివిధ సమస్యలను అధిరోహిస్తుందని వివరించాడు. అలాగే సోలార్ ఎనర్జీ అందుబాటులో లేని సమయంలోనూ విద్యుత్ నాణ్యతను పెంచడం ఈ సిస్టం ప్రత్యేకత అని తెలిపాడు. కాగా పోస్ట్ డాక్టరల్ ఫెలోగా అత్యున్నత పరిశోధన చేయడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..

నర్సంపేటలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో పదేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసి ప్రస్తుతం బెంగళూరులోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

అభినందనలు..

పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రెసిడెన్సీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిస్సార్ అహ్మద్, అధ్యాపక బృందం, బంధువులు, సన్నిహితులు కార్తీక్‌రెడ్డిని అభినందించారు.

రామప్పలో భక్తుల సందడి



స్వామివారి సన్నిధిలో భక్తులు

వెంకటాపురం(ఎం) : మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి



సుక్కమ్మ (ఫైల్)

నర్మెట : విషపురుగు కాటుతో మహిళ మృతిచెందిన సంఘటన కన్నెబోయినగూడెం బీక్యాతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు బీక్యాతండాకు చెందిన బానోత్ సుక్కమ్మ (49) ఓ రైతుకు పని నిమిత్తం కూలీకి వెళ్లింది. ఈక్రమంలో తనకు నీరసంగా, కళ్లు తిరుగుతున్నట్టుగా ఉందని తెలపడంతో వెంకిర్యాలలోని ఆర్ఎంపీకి వద్దకు తీసుకెళ్లారు. నోటి నుంచి నురుగు వస్తున్న ఆమెను పరీక్షించిన వైద్యుడు మృతిచెందినట్లు తెలిపాడు. కాగా భర్త సీతారాం ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ హిదాయత్‌అలీ తెలిపారు.

బావిలో పడి రైతు..

గూడూరు : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని అప్పరాజ్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్ద నరేష్ (38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టాలని బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి బావి వద్దకు వెళ్లి చూశారు. బావి దగ్గర చెప్పులు, సెల్‌ఫోన్ మాత్రమే ఉన్నాయి. దీంతో వారు బావిలో దిగి చూడగా నరేష్ మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు జారి వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు నరేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పాముకాటుతో బాలుడు..



కార్తీకేయ మృతదేహం

కాటారం : పాము కాటుకు గురైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాటారం మండల కేంద్రంలోని గారెపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలుకు చెందిన ఉప్పలపాటి సత్యనారాయణ కుమారుడు వేదాన్ష్ కార్తీకేయ(4) గారెపల్లిలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 21న సాయంత్రం వేదాన్ష్ కార్తీకేయ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెదిరింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి : వ్యవసాయ భూములు, ఇంటి స్థలాల తగాదాలో దాయాదుల బెదిరింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని నక్కపాక్కల తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ నరసింహ, లక్ష్మి, గుగులోత్ తిరుపతి, జ్యోతి, గుగులోత్ దేవయ్యలు గుగులోత్ కిష్టయ్యపై చేయి చేసుకొని చంపుతామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిష్టయ్య ద్విచక్రవాహనంపై ఊరు అవతలకి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కిష్టయ్య భార్య భూలమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేష్ తెలిపారు.

మమ్ముల్ని విడిచిపోతివా బిడ్డా..

- లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- ఉద్యోగంలో చేరిన నెలరోజులకే కాటేసిన మృత్యువు
- కొలువు రాకున్న బతికేవాడివి.. అంటూ రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఉపేందర్‌రావు (ఫైల్)

బయ్యారం : మంచి రోజులు వచ్చాయనుకుంటే మమ్ముల్ని విడిచి పోతివా బిడ్డా.. ఉద్యోగం లేకున్నా నా కొడుకు ఇన్నేళ్లు మమ్ముల్ని సాదుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే మంచి రోజులు వచ్చాయనుకున్నాం.. కాని ఇలా మమ్ముల్ని విడిచి వెళ్లే రోజు వస్తుంది అనుకోలే కొడుకా.. అంటూ మృతి చెందిన ఉపేందర్‌రావు వృద్ధ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరును పలువురిని కన్నీటి పర్యంతం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుటుంబంతో సంతోషంగా ఉండొచ్చని భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకొన్న కొత్త ఉద్యోగికి నెలరోజుల్లోనే దురదృష్టం లారీ రూపంలో మృత్యువు కబళించింది. కొలువుకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన కొడుకు లారీ ఢీకొని కానరానిలోకాలకు వెళ్లాడని తెలిసిన తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య, కన్నపిల్లలు విషాదంలో మునిగిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంధంపల్లి–కొత్తపేట గ్రామానికి చెందిన సంద్ర ఉపేందర్‌రావు (45) డిగ్రీ, డీఈడీ అభ్యసించారు. దీంతో కొంతకాలం ప్రైవేటు టీచర్‌గా పనిచేసి ఆ తర్వాత పెట్రోల్‌బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. ఉద్యోగ అర్హత వయసు అయిపోతుంది అనుకున్న సమయంలో ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో గంగారం మండలం పులుసంవారిగుంపు (మరిగూడెం)పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు.



భార్య పిల్లలతో ఉపేందర్‌రావు (ఫైల్)

నెలరోజుల్లోనే ఆశలు ఆవిరి..

సామాన్య కుటుంబానికి చెందిన ఉపేందర్‌రావుపై భార్య స్వప్న, కుమారుడు హేమతేజ్, కుమార్తె శాన్వితతో పాటు తల్లిదండ్రులు హరినాథ్, జయమ్మ ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణకు పెట్రోల్‌బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ కలను నెరవేర్చుకున్నాడు. విధులు నిర్వర్తించేందుకు వెళ్తున్న ఉపేందర్‌రావును లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి

బైక్‌ను ఢీకొన్న లారీ

గంగారం : ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని వెనకాల నుంచి లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన సంద్ర ఉపేందర్‌రావు (45) ప్రభుత్వ ఉపాధ్యాయడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితమే గంగారం మండలంలోని మర్రిగూడెం పులసంవారిగుంపు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. రోజు ఇంటినుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో గంగారం నుంచి కాటినాగారం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఉపాధ్యాయుడిని వెనకాల నుంచి వస్తున్న ఏపీ 02టీసీ 7088 నంబర్ గల లారీ వాహనం ఢీకొట్టడంతో ఉపేందర్‌రావు తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నర్సింగ సురేశ్ (38) సోమవారం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ సురేశ్ రోజు వారి డ్రైవర్‌గా వెళ్తు జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గౌరిగె సంపత్ ట్రాక్టర్ నడిపేందుకు తాత్కాలిక డ్రైవర్‌గా వెళ్లి ఓ రైతు పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి సురేశ్ అందులో ఇరుక్కుపోయాడు. దీంతో సమీపంలోని రైతులు గమనించి పొక్లెయినర్‌తో ట్రాక్టర్‌ను తొలగించి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు జనగామ ఏరియాఆస్పత్రికి మృతదేహన్ని తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సురేశ్ (ఫైల్)

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

- రూ.5 లక్షల విలువైన కాటన్ దగ్ధం

లింగాలఘణపురం : మండలంలోని జనగామ–సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల సమీపంలోని తాజ్‌శైలానీ పత్తి మిల్లులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.5 లక్షల విలువైన పత్తి దగ్ధమైనట్లు మిల్లు యజమాని వివరించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం మిల్లులో వెనక నుంచి మంటలు, పొగ రావడాన్ని వాచ్‌మెన్ గమనించి వెంటనే అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశాడు. ఆరుబయట పత్తి కుప్పలు ఉండడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పైభాగం మొత్తం అంటుకొని పొగలు కమ్ముకున్నాయి. మిల్లులోని ఫైర్‌సేఫ్టీ యంత్రాలతో మంటలను అదుపు చేస్తూ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. సుమారు ఐదారువేల క్వింటాళ్ల పత్తి ఉన్నప్పటికి పై భాగం మాత్రమే కాలిపోవడం, వెంటనే మిల్లులోని ఫైర్ సేఫ్టీ, అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో భారీ ప్రమాదం తప్పింది. విద్యుత్ ప్రమాదం జరిగేందుకు అక్కడ తీగలు కూడ లేవని, ప్రమాదం ఎలా జరిగిందో తెలియడంలేదని మిల్లు నిర్వాహకుడు తెలిపారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక జిల్లా అధికారి రైమండ్ పీటర్ సిబ్బందితో చేరుకొని మంటలను ఆర్పారు, అదేవిధంగా సీసీఐ సీపీఓ నర్సిరెడ్డి, జనగామ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, వైస్ చైర్మన్ శివకుమార్, తహసీల్దార్ అండాలు, ఎస్సై శ్రావణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రేమ లొల్లి

- కౌన్సిలింగ్ నిర్వహించి సఖి కేంద్రానికి తరలింపు

కురవి : మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ప్రేమ వ్యవహారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. యువతి ప్రేమ విషయంపై తల్లిదండ్రులు గృహనిర్బంధంలో ఉంచినట్లు ఆ యువతి డయల్–100కు ఫోన్ చేసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో పోలీసులు యువతితోపాటు ఆమె తల్లిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితోపాటు కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నారు. యువతి ఓ కంపెనీలో తాత్కాలికంగా ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. అక్కడే తిరుపతికి చెందిన ఓ యువకుడితో ప్రేమలో పడి, ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం కాస్తా యువతి తల్లిదండ్రులకు తెలియడంతో రెండ్రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మండలంలోని సొంతూరికి తీసుకొచ్చారు. దీంతో ఆ యువతి డయల్–100కు ఫోన్ చేయడంతో కురవి పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. కౌన్సిలింగ్ ఇచ్చి యువతిని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం

మహబూబాబాద్ రూరల్ : ఉరేసుకుని యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుల్లకుంట కాలనీలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుల్లకుంట కాలనీకి చెందిన మీసాల జ్యోత్స్న (23), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన రోహిత్ ప్రేమించుకున్నారు. కాగా రోహిత్ కిడ్నీలు దెబ్బతినడంతో గత అక్టోబర్ 22వ తేదీన మృతిచెందాడు. అప్పటి నుంచి జ్యోత్స్న మనస్తాపానికి గురైంది. దీంతో ఆదివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై వెంకటరెడ్డి కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్ : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో చోటుచేసుకుంది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన మహ్మద్ రఫీ (56) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది కాజీపేట–పెండ్యాల మధ్య ఆఫ్‌లైన్‌లో రైలు కింద పడి ఆత్యహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడికి బ్రెయిన్ కేన్సర్..

- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న వీరేంద్ర



టేకుమట్ల : కరోనా కాటుకు తండ్రి బలయ్యాడు.. రెక్కల కష్టంతో తల్లి పిల్లలను పోషించుకుంటుంది.. ఈ క్రమంలో కొడుకుకు బ్రెయిన్ కేన్సర్ సోకడంతో కన్నతల్లి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన మాడుగుల క్రాంతి–సంధ్యకు కుమారుడు వీరేంద్ర (12), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బ్రెయిన్ కేన్సర్ బాధపడుతున్న వీరేంద్రకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందజేస్తున్నారు. ఇప్పటికే రూ.5లక్షలు ఖర్చు చేయగా మరో రూ.14లక్షల మేర వైద్య ఖర్చులు అవుతాయని వైద్యులు తెలియజేశారు. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. కొడుకు మృతిని మరువక ముందే ఒక్కగానొక్క మనువడి దయనీయ స్థితిని చూసి తల్లడిల్లుతున్న తాత మాడుగుల వీరయ్య మనువడికి జీవితాన్ని ప్రసాదించడంటూ దాతలను వేడుకుంటున్నాడు.

దాతలు 96037 60761 ఫోన్ పే నంబర్‌కు ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నారు.